క్లుప్తంగా

ఆయుష్మాన్ భారత్‌లో చేరండి



పేర్లు నమోదు చేయిస్తున్న కౌన్సిలర్ దివ్య

ఆమనగల్లు: పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్ దివ్య కోరారు. ఆమనగల్లు పట్టణంలోని 6వ వార్డు పరిధిలో గుర్రంగుట్ట వద్ద ఆయుష్మాన్‌భారత్ పథకంలో పేర్ల నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ.. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సరైన ప్రచారం లేకపోవడంతో ప్రజలు సద్వినియోగం చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీకాంత్‌సింగ్, మల్లేశ్, శ్రీను, అశోక్, బ్రహ్మం, చంటి, శ్రీశైలం, గణేశ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగండి

ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు

యాచారం: విద్యార్థి దశ ఎంతో విలువైంది గొప్ప లక్ష్యంతో ముందుకు సాగాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు విద్యార్థులకు సూచించారు. యాచారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి మంచిపేరు తేవాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో యాచారం ఉన్నత పాఠశాలలో పోలింగ్ నిర్వహించే గదులను ఏసీపీ పరిశీలించారు. సీఐ లింగయ్య, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యం

డీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్

ఇబ్రహీంపట్నం: మోస పూరిత ప్రభుత్వ పథకాలు కాదు.. మనకు కావాల్సింది రాజ్యాధికారమే.. ఆ లక్ష్యం దిశగా ముందుకు సాగుదామని దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు డా. విశారదన్ మహరాజ్ పిలుపునిచ్చారు. మండలంలోని నెర్రపల్లి, దండుమైలారం, ముకునూర్ గ్రామాల్లో 10 వేల కిలో మీటర్ల స్వరాజ్య పాదయాత్ర కొనసాగింది. గురువారం దండుమైలారం గ్రామంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. అణగారిన కులాలు అగ్ర కులాలకు ఓట్లు వేసి రేషన్ షాపుల ముందు ఆరు కిలోల బియ్యం కోసం పడిగాపుల కాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అణగారిన కులాలు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించేందుకు వారిలో చైతన్యాన్ని కలిగించేందుకు పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మణ్, దుర్గాప్రసాద్, రవీందర్, రాకేష్, రాధాకృష్ణ, భాస్కర్, శేఖర్, సురేష్ పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను అమలు చేయండి

తుర్కయంజాల్: డిమాండ్ల సాధనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారం 6వ రోజుకు చేరుకుంది. తుర్కయంజాల్‌లోని ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యాలయంలో మధ్యాహ్న విరామ సమయంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ జి.సత్యనారాయణరావు మాట్లాడుతూ.. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, 2004 వరకు విధుల్లో ఉన్న ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్, ఈపీఎఫ్, జీపీఎఫ్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదన్నారు. డీఈ యాదగిరి, విక్రాంత్ రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రియల్ జోరు.. పాడిరైతు బేజారు

- ప్లాట్లు, వెంచర్లుగా మారుతున్న పంటపొలాలు
- పశుగ్రాసం కరువై ఇబ్బంది పడుతున్న పాడి రైతులు
- వ్యయప్రయాసలతో ఇతర ప్రాంతాలనుంచి కొనుగోలు
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు



కడ్తాల్‌లో వెంచర్‌గా మారిన పంట పొలం

కడ్తాల్: కడ్తాల్ మండలంలో పశుగ్రాసం కొరతతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకు సాగు విస్తీర్ణం తగ్గుతుండటం, ఉన్న కొద్దిపాటి వ్యవసాయ పొలాలు రియల్ ఎస్టేట్ రంగంలో భాగంగా ప్లాట్లుగా మారుతుండటంతో పశుగ్రాసం లభించని పరిస్థితి ఏర్పడింది. దీంతో పశుపోషణ రైతులకు భారంగా మారుతోంది. వరి సాగు తగ్గడంతో ఎండుగడ్డి కుడా లభించని పరిస్థితి నెలకొని ఉంది. ఉన్న కొద్దిపాటి వరి చేళ్లు చాలీచాలని నీటి లభ్యత కారణంగా ఎండిపోవడం, యంత్రాల ద్వారా కోతలు చేపట్టడంతో ఎండుగడ్డి సైతం లభించని పరిస్థితి దాపురించింది. గత్యంతరం లేక రైతన్నలు తమ పశువులను సంతల్లో విక్రయించడం, కబేళాలకు తరలించేందుకు సిద్ధపడుతున్నారు.

కడ్తాల్ మండలంలో...

కడ్తాల్ మండలంలో 15వేల వరకు పాడిపశువులు ఉండగా 4 వేలకు పైగా పాడిరైతులున్నారు. ప్రతిరోజు మండలంలో 15 వేల నుంచి 20 వేల లీటర్లకు పైగా పాల ఉత్పత్తి జరుగుతుంది. నీటి వసతి, సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు అందజేస్తున్నా ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భజలాలు రోజురోజుకి అడుగుంటి పోవడంతో బోర్ల కింద పచ్చిగడ్డి పెంచడం రైతులకు సాధ్యం కావడం లేదు. పశువులను సాకేందుకు గత్యతరం లేక ఎండుగడ్డిని, శనగ, పల్లీపొట్టును కొనేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. ఆర్థికంగా లేని రైతులు తమ పశువులను విక్రయానికి సిద్ధపడుతున్నారు.

'రియల్' వ్యాపారంతో పచ్చదనం కరువు..

కడ్తాల్ మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న రియల్ వ్యాపారంతో వేలాది ఎకరాల పచ్చని పంట పొలాలు రియల్ వెంచర్లుగా మారుతున్నాయి. దీంతో స్థానికంగా గడ్డి లభించక రైతులకు పశుపోషణ భారంగా మారుతోంది. గత్యంతరం లేక ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్ గడ్డి రూ.13వేల నుంచి 15వేలు పలుకుతుండగా, లారీ గడ్డి రూ.25 వేలకు పైనే పలుకుతుంది. అదే విధంగా శనగపొట్టు టన్నుకి



రైతులు కొనుగోలు చేసి తీసుకువస్తున్న వరిగడ్డి

రూ.5500, పల్లీపొట్టు టన్నుకు రూ.5 వేలు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో పశుగ్రాసం ధరలు మరింత పిరంగా ఉన్నాయి. భూమిపై పచ్చి గడ్డిపోచ కనిపించకపోవడంతో తప్పని పరిస్థితుల్లో అధిక ధర వెచ్చించి గడ్డి, శనగపొట్టు, పల్లీపొట్టు కొనుగోలు చేస్తున్నారు రైతన్నలు. ప్రభుత్వం పశుగ్రాస సమస్యను అధిగమించేందుకు ప్రణాళికలు తయారుచేసి.. పశుగ్రాసాన్ని నేరుగా రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

సబ్సిడీపై గ్రాసం అందించాలి



25 సంవత్సరాలుగా పాడి పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నాను. నాలుగైదు ఏళ్లుగా పశువుల పెంపకానికి గడ్డి దొరకని పరిస్థితి ఉంది. మండలంలోని భూములన్నీ ప్లాట్లుగా, వెంచర్లుగా మారుతున్నాయి. ప్రభుత్వం పాడి రైతులకు సబ్సిడీపై పశుగ్రాసం అందించాలి.

– లక్ష్మయ్య, పాడిరైతు, కడ్తాల్

ప్రభుత్వం చేయూతనివ్వాలి



ఏళ్లుగా పాడిపరిశ్రమనే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నాను. గతంలో కరువు వచ్చి పంటలు పండకపోయిన పాలపైనే జీవనం గడిపేవాళ్లం. ప్రస్తుతం పాడి పోషణ తలకు మించిన భారంగా మారింది. వ్యవసాయ పొలాలు చాలావరకు వెంచర్లుగా మారుతుండటంతో పశుపోషణ కష్టంగా మారింది. ప్రభుత్వం పాడిరైతులకు చేయూతనందించాలి.

– వెంకటేశ్, పాడిరైతు, కడ్తాల్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆమనగల్లు: ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల మండలాలకు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం క్రింద ఆర్థికసాయం మంజూరైంది. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో గురువారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్యరెడ్డి, విజయ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

రేపు మంచాలలో బీఆర్‌ఎస్ ధర్నా

మంచాల: పెరిగిన వంట గ్యాస్ ధరలకు నిరసనగా మంచాల మండల కేంద్రంలో శుక్రవారం ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు. ఉదయం 11 గంటలకు ధర్నా ప్రారంభమౌతుందని ఆయన పేర్కొన్నారు

నూతన నియామకం

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్‌గా ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ అడ్వకేట్ యాదిలాల్‌ను నియమించారు. ఈ మేరకు గురువారంహైదబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్.. యాదిలాల్‌కు నియామకపు ఉత్తర్వులు అందజేశారు. టీడీపీ నాయకులు నర్సింహ, సత్యం, పంచాక్షరి, శ్రీనాథ్, ప్రేమరాజ్, లింగం, మహేందర్, రాజిరెడ్డి, సత్యం, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు వీడండి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



రక్తదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి: రక్తదానం మహా గొప్పదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని గురువారం మండల పరిధిలోని పడకల్‌లో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఆరోగ్యవంతులైన యువకులు ప్రతి 3 నెలలకోసారి రక్తదానం చేయొచ్చన్నారు. రక్తదానం వలన రక్తశుద్ధి జరిగి రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. దైనందిన జీవితంలో వ్యాయామమం, యోగా, ధాన్యం ఏలానో రక్తదానం కూడా ఒకటిగా అలవాటు చేసుకోవాలన్నారు. రక్తదానంపై అపోహలు వీడాలన్నారు. ఈ శిబిరంలో 33 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి అంజయ్య గుప్తా, సర్పంచ్ శ్రీశైలం, మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు.. ప్రభాకర్‌రెడ్డి, బిక్యానాయక్, శ్రీనివాసమూర్తి, అజీం, జనార్ధన్‌రెడ్డి, రమేష్, వెంకట్‌రెడ్డి, రవీందర్‌యాదవ్, ఆరీఫ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం: ఐక్యత ఫౌండేషన్

ఆమనగల్లు: ఆలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ సహకారం అందిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. మాడ్గుల మండల కేంద్రంలోని ఈదమ్మ దేవాలయంలో గురువారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈదమ్మ ఆలయాభివృద్ధికి సహకారం అందిస్తామని ఆయన చెప్పారు. ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఈదమయ్య, నర్సింహ, కృష్ణయ్య, శ్రీకాంత్, వెంకటయ్య, కిరణ్, ఈశ్వర్, మోహన్, శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనార్దన్‌రెడ్డిని గెలిపిద్దాం: పీఆర్టీయూ

హయత్‌నగర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి కాటెపల్లి జనార్దన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన మద్దతుదారులు గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ నాయకులు వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయులకు పిల్లల సంరక్షణ సెలవులు, పీఆర్సీలో 30శాతం ఫిట్మెంట్ ఇప్పించేందుకు జనార్దన్‌రెడ్డి కృషిచేశారని తెలిపారు. రానున్న రోజుల్లో పండిట్, పీఈటీ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం, 317 జీఓ కారణంగా ఇతర జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్తారి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్ప భూములను కాపాడండి

సీపీఐ జిల్లా సమితి సభ్యుడు శివకుమార్



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

తుర్కయంజాల్: రాజీవ్ గృహకల్పకు సంబంధించిన భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా సమితి సభ్యులు పి.శివకుమార్ ఆరోపించారు. రాగన్నగూడలోని రాజీవ్‌గృహకల్ప (జేఎన్ఎన్‌యూఆర్ఎం) కాలనీ వద్ద ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ గురువారం సీపీఐ, సీపీఎం నాయకులతో కలిసి కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు సంబంధిత భూమిలో బండలను తొలగించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని.. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాజీవ్ గృహకల్ప కార్యదర్శి దుబ్బ యాదయ్య, సీపీఎం నాయకులు ప్రసాద్, కాలనీ అధ్యక్షుడు రవిదాసు, నాయకులు రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య కోరారు. గురువారం ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లి, నాగన్‌పల్లి, బొంగ్లూర్ ఆదర్శ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు.మార్చి 13న జరగబోయే ఎన్నికల్లో మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాములయ్య, మండల ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రవి, శ్రీరామ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిల్ అందజేత

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంకు చెందిన మాజీ వార్డు సభ్యులు మోత్కుపల్లి జంగయ్య అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలసుకున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు క్యామ మల్లేశ్ గురువారం జంగయ్యకు ఆర్థిక సహాయంతో పాటు ట్రై సైకిల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రావుల గోపాల్‌గౌడ్, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం

ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ వెంకటేశ్



విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ చేసిన ఉప్పల వెంకటేశ్

ఆమనగల్లు: ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ట్రస్టు చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చెప్పారు. మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామంలో గురువారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేశ్ మాట్లాడుతూ.. ట్రస్టు ద్వారా ఇప్పటివరకు రూ.25 కోట్లతో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. శిబిరంలో డా.అఖిల ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రి వైద్య బృందం 326 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల, తలకొండపల్లి ఎంపీపీలు పద్మారెడ్డి, నిర్మల, మాజీ జెడ్పీటీసీ పగడాల రవి, స్థానిక నాయకులు శ్రీశైలం, రఘుపతి, హన్మ్యానాయక్, వెంకట్‌నారాయణ, కిశోర్, వెంకటేశ్, శ్రీను, శంకర్, బిక్కుగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇర్విన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 555 మంది విద్యార్థులకు ఆమనగల్లు మండలం సింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో 70 మంది విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్సులను పంపిణీ చేశారు.

ఎల్మినేడు కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోదూరి రమేష్ డిమాండ్ చేశారు. గురువారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడు గ్రామంలో కాంగ్రెస్ నేతలతో సమావేశం నిర్వహించారు. ఎల్మినేడు నూతన కమిటీను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా వినోద్‌కుమార్, ఉపాధ్యక్షులుగామహేందర్‌గౌడ్, స్వామి, కార్యదర్శిగా కరుణాకర్, పాండు, పాండు, కోశాధికారిగా సత్తయ్యను ఎంపిక చేశారు.నేతలు..శేఖర్‌రెడ్డిబీరప్ప, బాషయ్య, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులతో మునగనూరు అభివృద్ధి

బీఆర్‌ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

హయత్‌నగర్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గత పదేళ్లుగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని బీఆర్‌ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి అన్నారు. ప్రగతి నివేదన పాదయాత్రలో భాగంగా గురువారం ఆయన తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని మునుగనూరులో పర్యటించారు. మంచినీటి బిల్లులు ఎక్కువగా ఉన్నాయని, సీసీ రోడ్లు కావాలని, అంతర్గత డ్రైనేజీ నిర్మించాలని తదితర సమస్యలు స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న మునుగనూరుకు ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని అన్నారు. కాలనీల్లో డ్రైనేజీ, రోడ్ల సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటి తలుపు తడుతున్నాయని, మున్సిపాలిటీలకు ప్రత్యేక నిధులు ఇచ్చి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు.

స్వయం ఉపాధికి సహకారం అందివ్వండి..

మర్రి మణెమ్మ ఉమెన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కుట్లు, అల్లికలు, బ్యుటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన సుమారు 160 మంది మహిళలు ప్రశాంత్‌కుమార్‌రెడ్డిని కలిశారు. తమకు తగిన సహాయం అందిస్తే స్వతహాగా ఉపాధి పొందుతామని కోరారు. ప్రగతి నివేదన యాత్ర తరువాత తప్పకుండా సహాయం అందిస్తామని ప్రశాంత్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. తుర్కయాంజాల మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు వేముల స్వాతి, తాళ్లపల్లి సంగీతా మోహన్‌గుప్త, నాయకులు కందాడి లక్ష్మారెడ్డి, శివకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాయమాటలతో ప్రజలను మోసగిస్తున్నారు

- అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్
- హాత్ సే హాత్ జోడో యాత్రలో కాంగ్రెస్ నేతలు



ఇబ్రహీంపట్నం: పాదయాత్రలో కోదండరెడ్డి, నాయకులు

ఇబ్రహీంపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాయమాటలతో ప్రజలను మోసగిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి, జిల్లా నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ ఆరోపించారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నంలో గురువారం కాంగ్రెస్ శ్రేణులు పాదయాత్ర నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ హయాంలోని సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ పనితీరును ఎండగడుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మీపతిగౌడ్, నాయకులు.. శంకర్‌గౌడ్, కృష్ణ, వెంకట్‌రెడ్డి, రమేష్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, రఘు, ఉదయ్‌పాల్‌రెడ్డి, జయమ్మ, నందకిషోర్, మల్లారెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

కష్టపడే వారికి గుర్తింపు..

యాచారం: పార్టీ బలోపేతం కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలతో గురువారం నగరంలోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పార్టీ కష్టకాలంలో అండగా ఉండి, బలోపేతం కోసం కృషి చేసే వారికి భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లి గ్రామానికి చెందిన కావలి బాలయ్యను యాచారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమించారు. మల్‌రెడ్డి రంగారెడ్డి ఈమేరకు నియమాక ఉత్తర్వులు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, కార్యనిర్వాహణ అధ్యక్షుడు మోటె శ్రీశైలం, కొత్తపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ఎండీ ఘనీ, యూత్ అధ్యక్షుడు కాలె కుమార్, నాయకులు లింగారెడ్డి, కృష్ణ, మహేందర్, మహేష్, వంశీ తదితరులు ఉన్నారు.

కుర్మిద్ద పాఠశాలలో సైన్స్ ఫెయిర్



సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సైన్స్ ఫెయిర్‌ను గ్రామ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించారు. రాకెట్ ప్రయోగం, హైడ్రాలిక్ నమూనా, బ్లడ్ గ్రూపును కనుక్కోవడం, కాంతి పరావర్తనం తదితర నమూనాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు స్వప్న, వెంకటేశ్వర్‌రావు, అశోక్ అన్నపూర్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కురుమయ్య



ధర్నాలో మాట్లాడుతున్న కురుమయ్య

ఆమనగల్లు: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఐసీడీఎస్‌కు నష్టం కలిగించే నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గుమ్మడి కురుమయ్య డిమాండ్ చేశారు. ఆమనగల్లు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె గురువారంతో రెండవరోజుకు చేరకుంది. అంతకుముందు ఆమనగల్లు పట్టణంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమయ్య మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. 2018 అక్టోబర్‌లో కేంద్రం పెంచిన వేతనాలను ఏరియర్స్ కలిపి అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, హెల్పర్లకు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 2015 నుంచి ఉన్న టీఏ, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని మూడు సంవత్సరాలు రేషన్ ట్రాన్స్‌పోర్టు చార్జీలను ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలకు ఇచ్చే రూ.200ను రూ.2000కు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చిన విధంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, వసంతలక్ష్మి, శైలజ, రాజ్యలక్ష్మి, సుగుణమ్మ, సునీత, జ్ఞానేశ్వరి, సంగీత, నిర్మల, అలివేలు, అనసూయమ్మ, గీత, విజయలక్ష్మి, కళావతి, లక్ష్మి, యాదమ్మ, అనిత పాల్గొన్నారు.